# వనదేవతలు

చార్వాక మహర్షి ఆశ్రమం. చతురస్రంగా వుంటుంది. చుట్టూ మహాయోధులకు మల్లే పెద్దపెద్ద చెట్లూ వాటిమధ్య మధ్య జీలుగుచెట్లూ నాలుగు పక్కలా నాలుగు వెదురు పొదలూ దట్టంగా కప్పుకొని వున్నాయి.

ఒకపక్కను, ఎత్తైన ప్రదేశంమీద పెద్ద మర్రిచెట్టూ, దానికింద పూరి, రెల్లుతోటి చిక్కగా నేసిన చిన్న ఇల్లూ వున్నాయి.

పొద నీడను ఒక జింకపిల్లను తొడమీద బెట్టుకుని చిగుళ్ళు మేపుతూ వున్న ఆ అమ్మాయి పేరు కురంగి. ఆమెకు జింకపిల్లలంటే మహా యిష్టం. కనుకనే తండ్రిగారు ఆ అమ్మాయిని కురంగి అన్నారు. ఆమె కళ్లనిండా పెంకెతనమూ - ముఖంనిండా లావణ్యమూ పరుగులువారుతూ వుంటాయి.

దానికి కొంచెం ఎడంగా వాలఖిల్య మహాముని ఆశ్రమం. దానిచుట్టూ మొగలి డొంకలు చిక్కగా పూసి మెరుస్తున్నాయి.

వాలఖిల్య మహాముని పౌత్రుడు శ్రీశుకుడు, తండ్రి జంబాల ఋషి. మహాదేవార్చ నకు, అక్కడకు అరక్రోసు దూరంలో వున్న రుమణ్వతీ నదిలో ఉత్పలములూ, కమల ములూ పక్క అడవిలోని శ్రీబిల్వ దళములూ రోజూ పట్టుకొని వెళ్లుతూంటాడు. అయితే అతని మామూలు తోవ నల్లమల మళుపులోంచి ఇప్పచెట్లలోవ మీదుగా చేరువగా వుం దేది. కాని ఈవేళ చాలా చీకటి వుండగా లేవడంచేత ఇప్పలోవలోని కొండచిలువలకు భయపడి దూరమైనా బాహాటంగా వెళ్లవచ్చునని చార్వాకాశ్రమం మీదుగా వచ్చాడు.

కురంగికి శ్రీశుకుడితో పరిచయం లేదు గాని - సాయంకాలం రుమణ్వతిలో తన పెంపుడు లేడిపిల్లలకు నీళ్లు తాగించడానికి, ఆ నది ఒడ్డునున్న దిరిసెన పూవులు వాటికి మేపడానికి వెళ్లినప్పుడు నీటికి దగ్గరగా సాయంసంధ్య నుపాసించే శ్రీశుకుణ్ణి చూడడం

కద్దు. సాయంకాలపు బంగారు ఎండలో సంపంగి పువ్వులా మెరిసే అతని ముఖం చూడ దం ఆ అమ్మాయికి ముచ్చటగా వుండేది.

అతడు తన చేరువకు రాగానే చట్టున లేచి నిలుచుంది. లేడిపిల్ల పల్లవ కబళం నెమరువేసుకుంటూ పక్కకు జరిగింది.

కురంగికి శ్రీ శుకుణ్ణి పలకరించాలనిపించింది. కాని - ఇంతవరకూ పరిచయం లేని ఏ ఋషి కుమారుడితోనూ మాటాడి ఎరగదు. ఎంతసేపూ లేడిపిల్లతోటేగా వ్యావృత్తి.

నల్లని కొంటె కళ్లు ఓరగా ఎత్తి, పగడపు తీగమీద తొణికిపడే ముత్యాలకు మల్లె ఎర్రని పెదవి మీద సన్నంగా నవ్వుతూ "మీ ఆశ్రమానికి ఇది కాదుగా తోవ" అంది తోవకు అడ్డంకాని అడ్డంగా నిలిచి.

శ్రీ శుకుడు ఈవేళ ఇక్కడ ఈమె మాటలాడుతుందని తోస్తే ఈ తోవంటే రాకపోను. అంత భయం ఆడపిల్లలతో మాటలాడడమంటే అతనికి. తక్కిన ఆశ్రమాలలో ముని కన్యలూ, ముని కుమారులూ ఎంతో కలసిమెలసి వుంటారు ఆడుకుంటూ పాడుకుంటూ -

తల వంచుకుని చేతిలో వున్న కలువ పువ్వు కదుపుతూ, బిల్వదళం మెలిపెడుతూ "ఏమో... ఇక్కడ ఆడపిల్లలుంటారని గాని, రాగూడదని గాని ఎరక్క దగ్గరతోవ అని వచ్చాను. పోనీ రేపణ్ణుంచి రాను" అన్నాడు.

"ఈవేళ వచ్చినందుకు" అంది మరీ ధైర్యంగా. లోకువ చిక్కితే అధికారం చలాయించడానికి ఆడపిల్ల తరవాతే.

"మళ్ళా వెనక్కి తిరిగిపోనా?" అన్నాడు పాపం. "ఎందుకూ - రెండు నీలోత్పలములూ, నాలుగు శ్రీబిల్వపల్లవాలూ ఇస్తే చాలు - ఈ తోవంట వెళ్లిపోవచ్చు" అంది పెంకెనవ్వు పెదవుల్లో అణుచుకుంటూ.

"ఇవి లేడిపిల్లలకిస్తే మహాపాపం. తలలో పెట్టుకోవడానికి కావివి. శ్రీమహాదేవపూజా కైంకర్యానికి. కావలిస్తే మా మొగలి పువ్వులు ఇష్టమొచ్చినన్ని తెచ్చుకోవచ్చును. సాయంకాలం రుమణ్వతి ఒడ్డుకి తెమ్మంటే తెస్తాను. వేళకు వెళ్ళకపోతే తాతపాదులు కోప్పడతారు అన్నాడు సవినయంగా శ్రీశుకుడు.

"ఆ మొగలి పువ్వులే మీ దేవుడికి పూజ చేసి ఇందులోవి నాకెందుకివ్వకూడదూ"

"మహాదేవుడికి మొగలి పువ్వులు పనికిరావు. ఆయన వాటిని శపించారు".

'ఏమో - వెర్రి నమ్మకాలూ శాస్త్రాలూ మీరూ - అంత చక్కని పూలకు శాపం ఏమి టి? ఆ దేవుడు పాపంగాని వాటిని అనుభవించలేక. సరే అంత పరిమళించే పువ్వులు

శిలలమీద కుళ్లిపోకుండా కేవలం మా తల్లో మెరిసే యోగం వుంది వాటికి. మొగలి పువ్వులంటే చాలా యిష్టం నాకు. సాయంత్రం ... తప్పకుండా రుమణ్వతి ఒడ్డుకి తెచ్చి పెట్టాలి మరి".

"ఎంతమాట! నా నృతంవదేత్"

పకపక నవ్వుతూ కురంగి "ఎక్కడికీ వేదానికి? దీని రెండోపక్కనే అసత్యం ఆడితే తప్పులేదని ఉంటుంది" అంది తండ్రిగారి వేద నిరాకరణ సారమంతా గ్రహించినట్టు.

అతడు శ్రీవత్స మహర్షి దౌహిత్రుడు. పేరు శ్యామశర్మ. కొంచెం చామనచాయగా వుంటాడు గనుక తాతయ్యగారు నవ్వుతూ అతనికి పెట్టిన పేరది.

భారద్వాజుడు, శ్రీశుకుడూ అతన్ని మరీ ఎగతాళి పట్టించడానికి సుశ్యామ అంటారు.

శ్యామశర్మ నాలుగ్ఘడియల పొద్దుండగానే కుశలు సమిధలు తేవడానికి రుమణ్వతీ తీరానికి వెళ్లాడు. గబగబా ఇన్ని సమిధలూ, దర్భలూ పోగుచేసి అంగవస్త్రంలో కట్టకట్టి నది దగ్గరకు దిగాడు. ఒక రాతిమీద ఇన్ని నీళ్లు చిలకరించి అంగవస్త్రపు మూట అక్కడపెట్టి సంధ్యావందనం చేసుకుంటున్నాడు.

కొంచెం దూరంలో శ్రీశుకుడు ఒక మొగిలి పొత్తి చేతిలో పట్టుకుని ఎవరికోసమో ఎదురుచూస్తున్నాడు.

నది పక్క రెల్లు పొదలలోనుంచి ఒక పదహారేళ్ల అమ్మాయి వస్తున్నది. పచ్చని చరమ సూర్యకిరణాలు పడి, ఇంగుది నూనెతో దువ్వుకొన్న ఆమె తల వెంట్రుకలూ రుమణ్వతి కెరటాలూ ఒక్కలా మెరుస్తున్నాయి. శ్యామల కాంతితో తళతళలాడుతూ సోగగా ద్రాక్ష తీగలా వుంది ఆమె శరీరం. ముఖంలో ప్రతి అణువూ నవ్వుతూన్నట్టుంది. ఒకపక్కని ఇర్రి –ఒకపక్కని లేడి – ఆమె చేతిలోని రెల్లు పువ్వులనూ దిరిశన పువ్వులనూ మేస్తూ వస్తున్నాయి. ఆ అమ్మాయి శ్రీ శుకుణ్ణి చూచి ఒక్క అడుగులో అతని దగ్గర వాలింది. లేడిపిల్లలు వెనకపడ్డాయి.

కురంగి దగ్గరకు రాగానే శ్రీ శుకుడు "ఇవిగో .... పువ్వులు" అన్నాడు. ఆత్రుతగా చనువు తీసుకుని చేతిలోనుంచి ఊడలాక్కుంది కురంగి.

పై రేకులు దూరంగా పారవేసి వాటికిందవి ఇర్రికందించి గర్భదళాలు రెండు జుట్టులో పెట్టుకుని "ఇప్పుడెలా వుంది నా జుట్టు" అంది ఒక ఒయ్యారంతో తలఎత్తుతూ.

"సాలగ్రామాల మీద పూజ చేసినట్టుంది" అన్నాడు అమాయకంగా.

"ఛీ – రాళ్లమీద పారవేసినట్టుంటే – ఈ పూవులు నాకక్కర్లేదు" లేనికోపంతో ఎత్తని

చేతితో తీసివేయబోయింది.

"వద్దు వద్దు.. నేను చెప్పలేనుగాని చాలా బాగున్నాయి" బతిమాలినట్టన్నాడు.

శ్యామశర్మకు సంధ్యావందనం తొణగడం లేదు వారిని చూస్తుంటే. ఎట్లాగో పూర్తిచేసి దర్భల కట్ట పట్టుకుని వారి దగ్గరకు వచ్చాడు.

శ్రీ శుకుదు, "మరి – నీ జుట్టులో పువ్వులు ఎలా వున్నాయో నువ్వే చెప్పు" అన్నాడు. శ్యామశర్మ అందుకుని "నే చెప్పనా చంద్రకాంతులు పడి కలకలలాడే రమణ్యతిలా వుంది, ఏం" అన్నాడు. అదిగదీ అన్నట్టు అభినందనపూర్వకంగా అతనివేపు చూసింది.

విశేష పరిచయం లేకపోయినా కురంగి 'శ్యామ'ను ఎరుగును. అతడు ఎప్పుడైనా చార్వాక మహర్షి వద్దకు వెళ్లి ఆయన తాలూకు ప్రచండమైన లోకాయతిక వాదం వింతగా వినడం వుంది.

"సుశ్యామా, ముఖ్యకాలం దాటిపోతోంది. అపచారం. నేనింకా సంధ్యవార్చలేదు. నేను వచ్చేదాకా ఇక్కడ వుంటారు గదూ – క్షణంలో వస్తాను" అని నీటి దగ్గరకు వెళ్ళాడు శ్రీ శుకుడు.

కురంగి అంది "శ్యామా, చాలారోజులైంది. ఒక్కసారి ఉషస్సూక్తాలు పాడవూ – రా ఇసకలో కూర్చుందాం. వెన్నెల ఎంతో బాగుందిగదూ. "కురంగీ, ఇప్పుడు సూక్తాలేమిటి పోనిద్దూ ఈ వెన్నెల్లో – ఇసకలో ఆడుకుందాం రా – రేపు మీ ఆశ్రమానికి వచ్చి చదువుతాను" అన్నాడు గొంతు సవరించుకుంటూనే.

"కాదు... ఇప్పుడే... తప్పించుకోవడానికి ... ఈ మాటలు.. నాకు తెలుసులే..." అంది.

శ్యామశర్మ పరవశంగా మొదటి సూక్తం పాడుతున్నాడు. చల్లని వెన్నెల్లో – ఆ ప్రశాంత సమయంలో ఆదిఋషులు పలికిన క్రమ కవితాగానం ఆ ఋషి కుమారుని స్వచ్ఛమైన ఉదాత్తానుదాత్త స్వరిత పరిష్కృతమైన మనోహరవాక్కు మీదుగా అమృతం కురుస్తోంది.

హఠాత్తుగా కురంగి "శ్యామా చూడు చూడు – ఆ సారసం నదిలో ఈదుతూ ఈ ఒడ్డుకు దగ్గరగా వున్న తామర తంపరలో చిక్కుకుని ఎలా గింజుకుంటోందో పాపం" అంది జాలిపడుతూ ఆత్రంగా – చట్టున సూక్తం ఆపి శర్మ పరుగెత్తుకువెళ్లి సారసాన్ని చిక్కుల్లోంచి విడిపించి తెచ్చాడు.

సారసం అతన్ని కరుస్తూ అరుస్తూ శర్మ సందిట వుంది. "అమ్మమ్మా! వదిలిపెట్టు పాపం" అంది కరుణతో చలించే కళ్లతో కురంగి.

"భయంలేదు. ఈ తామరతూడు పెడితే... తింటూ ఆడుకుంటుంది మన దగ్గర" తెచ్చిన తూడు ఒకటి చంచువుకు అందించాడు. సారసం తూడు అందుకుని శర్మ ఒడి దిగి ఇసకలో నడుస్తోంది. ఆమె లేడి ఇసకలో ఎగిరి ఆడుకుంటోంది. ఇర్రి మాత్రం ఆమె తొడమీద తలపెట్టి చంద్రుణ్ణి చూస్తోంది.

శ్యామ సూక్తశేషం అందుకున్నాడు. కురంగి పరవశంగా వింటోంది. సారసం మెల్లగా వెళ్లి ఆమె వల్కలమును చంచూపుటంతో గట్టిగా పట్టుకుంది. ఆమె అదిరిపడి విదుల్చుకోబోతే వదలలేదు. శర్మ చప్పున ఆమె పక్కగా జరిగి అదలించగా అరుస్తూ నదివైపు ఎగిరిపోయింది.

ఈ తొట్రుబాటుతో కురంగి శర్మ చేతుల్లో చిక్కింది. అతని చేతిమీద - భయంతో తన తల వాల్చి "అబ్బ! ఏం సారసం - వదిలించమంటే తెచ్చి ఒళ్లో పెట్టుక్కూచున్నావు - చాలు - చంపేసింది" అంది నవ్వుతూ సిగ్గుగా.

ఆమె తలలోని మొగలిపూల తీవ్ర పరిమళం శ్యామశర్మ తలనూ మనస్సునూ గిర్రున తిప్పింది. శిలకు శ్రీరామస్పర్శతో చైతన్యం వచ్చి జగన్మోహిని పుట్టినట్టు అంతవరకెన్నడూ స్త్రీస్పర్శ ఎరగని శర్మ కఠోర బ్రహ్మచర్యా జడప్రకృతిని చీల్చుకొని ఒక అపూర్వ మధురానుభూతి పైకుబికింది. ఆమె తాకినంత మట్టుకు అతని శరీరంలోని నెత్తురు కితకితలుపెట్టి కిలకిల నవ్వింది.

శ్రీశుకుడు వచ్చాడు. సర్దుకుని కూచున్నారు. "ఇంక ఆశ్రమానికి వెడదామా" అంటూనే కూర్చున్నాడు.

"ఏమిటంత తొందర - మనం ఎక్కడ వుంటే అదే ఆశ్రమం. వెళ్లలేకపోతామా" అంది హేలగా. "తాతపాదులు కోపపడతారు. తొందరగా వెళ్లాలి" లేవబోయాడు.

"పోనీ ... నా మాటమీద అంత నిర్లక్ష్యమైతే ఈ పువ్వులు నాకక్కరల్లేదు" చేతిలో పువ్వులు విసిరికొట్టింది కోపం నటిస్తూ.

"అబ్బా - ఏమిటీ కోపాలు. ముళ్లు చీరుకొని కోసిన పువ్వులు - ఇట్లాగేనా విసరదం... ఇంకేం మంచి గర్భదళాలు తలలోనే వున్నాయి. ఆడపిల్లలు మహాగడుసువారు" కహకహ నవ్వాడు. ఆ పిల్ల విసిరిన ఆ పూవులు మెరుపుల్లా తగిలాయి. అతనిలో ఏదో ఉత్సాహ ఝురి పుట్టుకువచ్చి అతన్ని తీవ్రంగా చలింపజేసింది.

కొండగోగు పువ్వులా ముఖంపెట్టి "ఏంపనీ ఇదీ?" అని నవ్వుతూ ఆమె చేతులు పట్టుకున్నాడు. పకపక నవ్వుతూ వెన్నలా కరిగిపోయింది కురంగి.

రుమణ్వతిలో ఒకప్రక్కను కమండలం ముంచిన చప్పుడు. చేయి ఎత్తు మనిషి. ఒక కాషాయాంబరం కప్పుకొన్నారు. బుజంమీద పొడుగ్గా ఎదిగిన జడలు పడుతున్నాయి. పొడుగైన గడ్డం. రెండూ తిలతండుల న్యాయంగా వున్నాయి. బ్రహ్మతేజస్సు ముఖంలో ఉట్టిపడుతూండగా శ్రీశుకాదులు ఉన్నచోటికి వచ్చారు,

"అమ్మయ్యో – తాతపాదులు" అన్నాడు శ్రీ శుకుడు.

అంతా సంభ్రమంగా – వినమ్ర శీర్షాలతో నించున్నారు. జంబాల మహర్షులవారు సమీపానికి రాగానే ముగ్గురూ "నమః పరమర్షయే తాతపాదాయ" అని పాదములు స్పృశించి నించున్నారు.

"దీర్ఘాయుష్యమస్తు – నాయనా, ఇంత చీకటిపడేవరకూ ఇక్కడే వున్నారేమీ – మార్గాలు సరిగా వుండవు. గర్తపాషాణాదులు భ్రమ ప్రమాదాస్పదాలుగా వుంటాయి.. లేవండి వెళ్లుదాం.. ఇదిగో కురంగి! లేమ్మా నీ లేడిపిల్లలేవీ?" అంటూ ఆ అమ్మాయిని దగ్గరగా తీసుకున్నారు. ఆమె తల వంచుకొని "నాకు ఉషస్సూక్తాలు నేర్చుకోవాలని వుంది. చెబుతారా పితృపాదులు?" అంది ముద్దుగా.

"అమ్మా అభ్యంతరమేమి? రేపటినుంచి తీరుబడిగా వున్నప్పుడల్లా ఆశ్రమానికి వస్తూండు. శ్యామ, భరద్వాజ, చిరంజీవీ, అంతా వుంటారు. శ్యామశర్మ కంఠం వీణలా వుంటుంది. అతడు చెబుతాడు – ఇంక వెళ్లవలె. రండి" అని ముందు ఆయన నడుస్తున్నారు. వెనుక శ్రీ శుకుడు తర్వాత కురంగి పిమ్మట శ్యామశర్మ ఆయన్ను అనుసరించారు.

"భవిష్యద్గురుదేవులు శ్యామశర్మ గారికి నమస్కారాలు" అని వెనక్కి తిరిగి సన్నంగా అని శర్మ ఉత్తరీయ వల్కలం లాగింది కొంటెపిల్ల.

●●●